క్లుప్తంగా

1న మట్టి వినాయక విగ్రహ తయారీ పోటీలు

హన్మకొండ చౌరస్తా: సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు జరగనున్న పోటీల్లో విగ్రహ తయారీకి కావాల్సిన మట్టిని సంస్థ సమకూరుస్తుందని పేర్కొన్నారు. అలంకరణకు కావాల్సిన సామగ్రిని మాత్రం విద్యార్థులే స్వయంగా వెంట తీసుకుని రావాలని కోరారు. పూర్తి వివరాలకు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

3న ట్రాక్‌మెన్ల 'చలో సికింద్రాబాద్'

కాజీపేట రూరల్: సెప్టెంబర్ 3వ తేదీన ట్రాక్‌మెన్ సమస్యల పరిష్కారం కోసం రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట చేపట్టిన ట్రాక్‌మెన్ యుద్ధభేరి మహాధర్నాను విజయవంతం చేయాలని మజ్దూర్ యూనియన్ జమ్మికుంట (కాజీపేట) బ్రాంచ్ సెక్రటరీ బి.శ్రీనివాస్, చైర్మన్ వి.రాజయ్య పిలుపునిచ్చారు. మజ్దూర్ యూనియన్ జోనల్ జనరల్ సెక్రటరీ శంకర్ రావు పిలుపు మేరకు చేపట్టే ధర్నాకు ట్రాక్‌మెన్లు తరలిరావాలని కోరారు.

న్యూశాయంపేటలో బోనాలు



కాజీపేట అర్బన్: శ్రావణమాసం గురువారం సందర్భంగా న్యూశాయంపేటలో బోనాల వేడుకలను నిర్వహించారు. కుమ్మరుల పూజలతో ప్రారంభమైన వేడుకలు.. శివసత్తులు, గ్రామస్తుల ఆటపాటలతో వైభవంగా జరిగాయి. వేడుకలను కార్పొరేటర్ మామిండ్ల రాజు పర్యవేక్షించారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు, మాజీ మేయర్, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉమ్మడి జిల్లాతో గద్దర్‌కు విడదీయరాని బంధం



కాజీపేట: ప్రజా వాగ్గేయకారుడు గద్దర్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉందని డాక్టర్ జీలకర్ర శ్రీనివాస్ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల నిర్మాణంలో గద్దర్ స్ఫూర్తి, త్యాగాలను గుర్తుచేసుకోవడం కోసం ఈనెల 31న వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో ప్రథమ వర్ధంతి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో గద్దరన్న యాది సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కోండ్ర నర్సింగ రావు, దూడల సాంబయ్య, సాయిని నరేందర్, గాజుల గోవర్ధన్, సాంబయ్య, సింగారపు అరుణ, మచ్చ దేవేందర్ పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలి



హన్మకొండ అర్బన్: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం (టీఎస్‌సీపీఎస్ ఈయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘం నాయకులతో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు విరమణ అనంతరం విశ్రాంత జీవితంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతం కాకుండా సామాజిక భద్రత కల్పించేందుకు పింఛన్ ఇవ్వాల్సిన సామాజిక బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ మేరకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సంఘం రాష్ట్ర డాక్టర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వెంకటస్వామి, రాష్ట్ర సెక్రటరీ ఎస్‌కే అఫ్జల్, శ్రీలత, జిల్లా బాధ్యులు సంగ రవి, సరళ, సదానందం, అక్బర్, కృష్ణ పాల్గొన్నారు.

పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ వేడుకలు

కాజీపేట: కాజీపేట కర్మెల్ బాప్టిస్ట్ చర్చిలో మండల పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ 6వ వార్షికోత్సవాన్ని డి.డేవిడ్ అయ్యగారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఆరేళ్లుగా సంస్థ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై చర్చించారు. సమావేశంలో బిషప్ జాన్ మార్కండేయ, బిషప్ డానియల్ కల్యాణపు, డాక్టర్ కె.కురియన్, బి.విక్టర్ బాబురాజు, మంద కుమార్, ప్రతాప్, దేవదాస్, కరుణాకర్, జాకోబ్ పాల్గొన్నారు.

తెలుగు భాష అమ్మవంటిది



ఆర్ట్స్ కళాశాలలో రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



వరంగల్ చౌరస్తా: నివాళులర్పిస్తున్న సంస్కృతాంధ్ర అధ్యాపకులు, విద్యార్థులు



హసన్‌పర్తి: తెలుగు వర్ణమాలను ప్రదర్శిస్తున్న సుజాత స్కూల్ విద్యార్థులు

కేయూ క్యాంపస్: తెలుగు భాష అమ్మవంటిదని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి అన్నారు. తెలుగు మాతృభాషా దినోత్సవాన్ని కళాశాలలో తెలుగు విభాగంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలుత తెలుగు భాషపై పట్టుసాధించి ఆ తరువాత ఇతర భాషలు నేర్చుకోవాలని సూచించారు. ఈమేరకు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి డాక్టర్ సదాశివ్, అధ్యాపకులు చిర్ర రాజు, మామిడి లింగయ్య, చింతం ప్రవీణ్‌కుమార్, ఫిరోజ్‌పాషా, శ్రీధర్‌కుమార్ లోథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా 'తెలుగు భాషా దినోత్సవం'

వరంగల్ చౌరస్తా: గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతిని వరంగల్‌లోని సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సోనబోయిన సతీష్ మాట్లాడుతూ తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు, వ్యవహారిక భాషోద్యమ మూల పురుషుడు గిడుగు రామ్మూర్తి శ్రీకాకుళం జిల్లా పర్వతాల పేటలో జన్మించారని గుర్తుచేశారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకత్వంలో జనవాణి పత్రికలో సంపాదకీయాలకు వాడుక భాషలో శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, మేకల లింగమూర్తి, పరాశరం జయకృష్ణ, శ్రీధర్ల కుమార్‌స్వామి, శెట్టి దేవరాజు, సుస్మిత, కళాశాల సిబ్బంది రవీందర్, రాజు, లింగయ్య, వనమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష దినోత్సవం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాంతరాం కర్ణ మాట్లాడుతూ అతి ప్రాచీన భాషల్లో అత్యంత ప్రధానమైన భాష తెలుగు అని కొనియాడారు. ఎనిమిది కోట్ల మంది మాతృభాష తెలుగు అని పేర్కొన్నారు. ఆంగ్ల భాష మోజులో పడి తెలుగు భాషకు ప్రాధాన్యం తగ్గిపోవడం బాధాకరమని వాపోయారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు నాగరాజు, రాధాకుమారి, అచ్యుత్‌రెడ్డి, అరుణ, సుచిత్ర, సంధ్య, అఖిల, ప్రవళిక, దేవిక, సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పనులకు బల్దియా వాహనాలు?

- భవన నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ఆసక్తి
- ఆరు రోజుల నుంచి రాత్రుళ్లు ట్రిప్పులు
- ఏ నిబంధన ప్రకారం చేశారనే ప్రశ్నలు
- రూ.లక్షల్లో చేతులు మారాయనే చర్చ
- కమిషనర్ ఎలా స్పందిస్తారనేది కీలకం



భవన నిర్మాణ వ్యర్థాలను తరలిస్తున్న బల్దియా వాహనం

సాక్షి, వరంగల్: ప్రైవేట్ భవనాల నిర్మాణ వ్యర్థాలను తరలించేందుకు గ్రేటర్‌వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)కు చెందిన వాహనాలను ఉపయోగించడం వివాదాస్పదమవుతోంది. దాదాపు రెండు ఎకరాల్లో నిర్మించిన ఓ ప్రైవేట్ సూపర్ మార్కెట్‌ను వారం రోజుల క్రితం నేలమట్టం చేయడంతో ఆ భవన నిర్మాణ శిథిలాలతోపాటు అక్కడి మట్టిని బల్దియాకు చెందిన కంపాక్టర్ వాహనాల్లో తరలించడం ఏ నిబంధన ప్రకారం చేశారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలో ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తను తరలించేందుకు సమయపాలన పాటించని బల్దియా సిబ్బంది.. తమ విధులు ముగిశాక ఆసక్తి చూపించి మరీ రాత్రి సమయాల్లో ప్రైవేట్‌భవనానికి చెందిన శిథిల వ్యర్థాలను తరలింపు వెనుక ఉన్న పెద్ద అధికారుల హస్తం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్కార్ ఇంధనంతో పదుల సంఖ్యలో ట్రిప్పులు వారంసుంచే నడుస్తున్నాయని అక్కడి ప్రజలు చర్చించుకుంటుండడం గమనార్హం. దీంతో రూ.లక్షల్లోనే చేతులు మారాయన్న టాక్ ఉంది. ఇదిలాఉండగా సదరు భవన యజమాని బల్దియా కమిషనర్‌కు దరఖాస్తు చేసుకుంటేనే రాంపూర్‌కు ఈ భవన వ్యర్థాలను తరలిస్తున్నామని ఆ వాహనాల సూపర్‌వైజర్ అంటుండగా.. సదరు భవన యజమాని రిక్వెస్ట్‌చేస్తే ఆ వ్యర్థాలను తరలించాక యూజర్ చార్జీలు వసూలు చేద్దామనుకుంటున్నామని బల్దియా సీఎంహెచ్‌ఓ రాజు 'సాక్షి'కి వివరణ ఇచ్చారు. ఒక్కో ట్రిప్పునకు మామూలుగా రూ.2,500 వరకు కావొచ్చన్నారు. ఇప్పటివరకు ఆరు రోజుల్లో ఆరు ట్రిప్పులు పంపామని, అంతా పూర్తయ్యాక వారినుంచి యూజర్ చార్జీలు వసూలు చేస్తామని తెలిపారు. దీనిపై బల్దియా కమిషనర్‌ఎలా స్పందిస్తారన్నది ఆసక్తిగా మారింది.

గవర్నర్‌ను కలిసిన కలెక్టర్లు, సీపీ



కాజీపేట అర్బన్: నగర పర్యటన ముగించుకుని జనగామ జిల్లాకు బయలుదేరిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. చారిత్రాత్మక చరిత్ర గల ఓరుగల్లు నగరంలో సుపరిపాలన అందజేయాలని వారికి గవర్నర్ సూచించారు.

జిష్ణుదేవ్‌ను కలిసిన పల్లె దవాఖాన వైద్యులు

కాశిబుగ్గ: ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను తెలంగాణ పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నిట్ గెస్ట్‌హౌస్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు బొకే అందజేసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

వక్తృత్వ పోటీలు



విద్యారణ్యపురి: అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని 9వ తరగతి నుంచి పీజీ విద్యార్థుల వరకు హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో తెలుగు భాషా ఆవశ్యకత అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఈడీ కళాశాల అధ్యాపకురాలు రవ్వ విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు రామ్మూర్తి పంతులు మూల పురుషుడని గుర్తుచేశారు. ఆయన బహుభాషా శాస్త్రవేత్త అని కొనియాడారు. అరసం జిల్లా అధ్యక్షుడు బూర భిక్షపతి, జనరల్ సెక్రటరీ మార్క శంకర్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మాచారి నిధి, జిల్లా ఉపాధ్యక్షురాలు సుమిత్ర, అధ్యాపకులు దేవ నారాయణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జేఎన్‌ఎస్‌లో టెన్నికాయిట్ ఎంపికలు



క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 7వ సబ్ జూనియర్స్ బాలబాలికల టెన్నికాయిట్ ఎంపిక పోటీలను గురువారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించారు. హనుమకొండ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికల్లో ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది బాలికలు, 60 మంది బాలురు హాజరైనట్లు అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి అలువాల రాజ్‌కుమార్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన నలుగురు బాలికలు, నలుగురు బాలురను సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్, జిల్లా కార్యదర్శి గోకారపు శ్యామ్, కోశాధికారి, ఎండి. జాహూర్, పీడీలు జీ శ్రీనివాస్, డీ నర్సయ్య, ఆర్ శ్రీధర్, పీఈటీలు కమలాకుమారి, సరిత, కావేరి, నిర్మల, భాస్కర్, నిరంజన్, సీనియర్ క్రీడాకారులు ప్రకాశ్, కౌషిక్, దేవేందర్, అర్జున్, పవన్‌సాయి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

ఖిలా వరంగల్: రైతులు సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పాటించాలని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న సూచించారు. జాతీయ ఆహార భద్రత పథకం భాగంగా గురువారం ఖిలావరంగల్ మండల మామునూరు పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధన స్థానం నేతృత్వంలో పత్తి సాగుపై అవగాహన కల్పించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు నాగభూషణ్, సౌమ్య, రాజు, రాశి విత్తన సంస్థ మేనేజర్ మనోజ్, ప్రదీప్, హర్ష, సురేశ్, రైతులు పాల్గొన్నారు.

మహాజన సభలో మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: నేషనల్ కోఆపరేటివ్ అగ్రికల్చర్, రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంక్స్ ఫెడరేషన్ వార్షిక మహాజన సభలో వరంగల్ డీసీసీబీ, తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొన్నారు.

కవిత బెయిల్‌కు కాంగ్రెస్ సహకరించింది

రామన్నపేట: సింఘ్వీ రాజ్యసభ అభ్యర్థిత్వం కోసం కవిత బెయిల్‌కు సహకరించింది కాంగ్రెస్ పార్టీనేనని, కవిత బెయిల్‌పై ప్రధాన మోదీని, బీజేపీని తప్పుపట్టడం సిగ్గుచేటని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. ప్రధాని మోదీ ఫ్లెక్సీని మండిబజార్‌లో దహనం చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకొని, రాజద్రోహం కేసు నమోదు చేయాలని కోరారు. ఈమేరకు బీజేపీ నాయకులతో కలిసి వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

వరకట్న వేధింపుల కేసులో జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: వరకట్నం తీసుకురావాలని భార్యను వేధించిన కేసులో వరంగల్ నగరానికి చెందిన పబ్బినేని శ్రీనివాసరెడ్డికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం కొత్తగూడెం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. వరంగల్ పెరికవాడకు చెందిన పబ్బినేని శ్రీనివాసరెడ్డికి కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన పుణ్యవతితో 2013లో వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.1.50లక్షల కట్నం, రెండు బంగారు ఉంగరాలు, రూ.లక్ష విలువైన గృహోపకరణాలు ఇచ్చారు. ఆతర్వాత అదనపు కట్నం తీసుకురావాలని పుణ్యవతిని ఆమె అత్త, భర్త వేధిస్తుండడంతో 2015లో భర్త శ్రీనివాసరెడ్డి, అత్త విజయపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసును జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.సాయిశ్రీ విచారించగా శ్రీనివాసరెడ్డిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో నెల రోజుల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున బడిపాటి విశ్వశాంతి వాదించగా ఎస్.కే.ఘని, బోడ శోభన్ బాబు సహకరించారు.

మహాసభను విజయవంతం చేయండి

ఖిలా వరంగల్: సెప్టెంబర్ 1, 2వ తేదీల్లో పూణేలో జరగనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 8వ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆరెల్లి కృష్ణ పిలుపునిచ్చారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు శివనగర్‌లో గోదాం ప్రాంగణంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నున్న అప్పారావు, కార్మిక నాయకులతో కలిసి వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వరంగ పరిశ్రమలను కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్ శక్తులకు అప్పగించి శ్రామికవర్గాన్ని కోలుకోలేని దెబ్బ తీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మహేందర్, కన్నయ్య, రాకేష్, వెంకటేశ్వర్లు, సుధాకర్, అమరేందర్, మధు, యాంక లక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాపిత యూనివర్సిటీల్లో నిరసనలో భాగంగా కాకతీయ యూనివర్సిటీలోని ఉద్యోగులు కేయూ పరిపాలన భవనం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అఖిల భారత విశ్వవిద్యాలయాల ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడారు. వీసీలను నియమించాలని, పీఆర్‌సీని అమలు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగులందరికి హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొక్క మొగిలి, ఉప్పు ప్రేమ్‌సాగర్, బాలాజీ, మంద శ్యామ్, విజయ్‌రావు, మల్లికార్జున్, దేశిని రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు డిమాండ్ చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో 16 పీరియడ్‌ల వర్క్‌లోడుతో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా గుర్తించాలని కోరారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేందర్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ దేవోజీనాయక్, బాధ్యులు తిరుణహరి శేషు, ఎర్రబొజ్జు రమేష్, రవీందర్‌రెడ్డి, నవీన్, ప్రశాంత్, బాలకృష్ణ, బక్కి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

హన్మకొండ: తమ కాలనీ సమస్యలు పరిష్కరించాలని 57వ డివిజన్ పరిధి హనుమకొండలోని గాంధీనగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. ఈమేరకు హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయం ప్రజాభవన్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందించారు. గాంధీనగర్ ప్రధాన రోడ్డులో గాంధీ విగ్రహం ఏర్పాటుకు అభివృద్ధి కమిటీ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.వీరేందర్, ప్రతినిధులు బి.శ్రీనివాస్ రెడ్డి, కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: 40వ డివిజన్‌లోని సమస్యలను బల్దియా అధికారులు పరిష్కరించాలని కార్పొరేటర్ మరుపల్లి రవి కోరారు.

మడికొండ ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పుల్యాల కిషన్‌ను గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, బిల్ల రవీందర్‌యాదవ్, పల్లపు అర్జున్, నవీన్‌యాదవ్, వసుకల శ్రీనివాస్, నాగరాజు, సామేల్, గోపి, వినయ్, చంటి, కార్తీక్, విష్ణు, వినీత్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్



మామునూరు: విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న సిద్ధార్థ్‌రాజ్, చిరంజీవి



కేయూ క్యాంపస్: ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, తదితరులు



విద్యారణ్యపురి: ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం నెహ్రూ, ఉపాధ్యాయులు

మామునూరు: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సిద్ధార్థ్‌రాజ్, చిరంజీవి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ పూర్ణిమ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నవోదయ క్రీడాకారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్‌లో..

విద్యారణ్యపురి: హనుమకొండలోని సుబేదారిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి హైస్కూల్ హెచ్‌ఎం గుగులోతు నెహ్రూ, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మునిగాల కర్ణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని, జీవితంలో క్రీడలను అంతర్భాగం చేసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి సూచించారు. కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వెంకయ్య అధ్యక్షతన జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వాసుదేవ రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏకశిల హైస్కూల్‌లో..

నయీంనగర్: జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని హనుమకొండ కేయూ రోడ్డు ఏకశిల హైస్కూల్‌లో గురువారం నిర్వహించారు. శారీరక వ్యాయామం కోసం క్రీడలు దోహదపడుతాయని అన్నారు. తెలుగు భాష గొప్పదనాన్ని తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక అభివృద్ధికి క్రీడలు దోహదం

ఖిలా వరంగల్: మానసిక అభివృద్ధికి క్రీడలు దోహద పడుతాయని జాతీయ జూడో అసోసియేషన్ కోశాధికారి బైరబోయిన కైలాస్ యాదవ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ అధ్యక్షుడు మండల పరశురాములు తెలిపారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని వరంగల్ ఉర్సు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన క్రీడలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు కూడా అవసరమేనని పేర్కొన్నారు. క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఉపాధ్యాయులు ఆకుతోట శ్రీనివాస్, జె.స్వామి, సతీష్, విజయ, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజిద్దాం



ర్యాలీలో పాల్గొన్న పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు

రామన్నపేట: వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుల విగ్రహాలనే పూజిద్దాం – పర్యావరణాన్ని కాపాడుదామని ప్రొఫెసర్ ఠాగూర్ రతన్ సింగ్ అన్నారు. ఈమేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏవీవీ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏవీవీ కళాశాల నుంచి ఎంజీఎం సర్కిల్ వరకు వలంటీర్లు గురువారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు నీటిలో మట్టి కరిగి నీళ్లలో ఉండే జీవరాసులకు ఎలాంటి హాని కలగదని చెప్పారు. పీఓపీతో చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితమై అందులోని జలచరాలు, ఆ నీటిని వినియోగించే జంతువులు, మనుషులు అనారోగ్యానికి గురవుతారని వివరించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా కన్స్యూమర్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సభ్యులు వసంత, కుమారస్వామి, విజయరావు, బండ కాళిదాస్, పర్యావరణ ప్రేమికులు నరేష్, ప్రకాష్, కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.అనిత, వలంటీర్లు శివరాజ్, ఫయాజ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో ఘనంగా తీజ్ వేడుకలు



హనుమకొండ అశోకకాలనీలోని గిరిజన భవన్‌లో తీజ్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, తదితరులు



హన్మకొండ: నిమజ్జనానికి వెళ్తున్న మహిళలు



జులైవాడలోని గణేష్‌నగర్‌లో..



హనుమకొండ రాంనగర్ బంజారా కాలనీలో..



గుండ్లసింగారంలో..

గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ అశోకకాలనీలోని గిరిజన భవన్‌లో తీజ్ ఉత్సవాలను గురువారం నిర్వహించారు. రాంనగర్ బంజారా కాలనీలో, జులైవాడలోని గణేష్‌నగర్ కాలనీలో తీజ్ ఉత్సవాలను బంజారాలు ఘనంగా జరుపుకున్నారు. గుండ్ల సింగారంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తీజ్ వేడుకల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పలువురికి జరిమానాలు

రామన్నపేట: లైసెన్స్ లేకుండా వాహనం నడుతూ పట్టుబడిన ఏడుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.7,500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 18 మందికి రూ.25,500 జరిమానా విధించినట్లు వివరించారు.

వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ జిల్లా శాయంపేట గ్రామానికి చెందిన వలుప దాసు ప్రశాంత్ (26) ఎంజీఎంలో మృతి గురువారం చెందారు.